# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 87 EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 28 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 87 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 28 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


## ఆగస్టు నాటికి గులాబీ జాబితా...

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




బీఆర్ఎస్ అధ్యక్షుడు , ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు రెండు దశల్లో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నారా? 60 మందిని జూలై 24న

మిగతా 2లో...

### ఢిల్లీ సర్వీసు బిల్లుకు
## వైసీపీ మద్దతు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

జాతీయ రాజధాని ఢిల్లీలోని అధికారలపై మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు వైసీపీ మద్దతు ఇస్తోంది. ఢిల్లీలో ప్రజలకు ఎన్నుకున్న ప్రభుత్వానికి ఉండాల్సిన అధికారాలను కేంద్రం లాక్కుంటోందని చాలా కాలం నుంచి కేజ్రీవాల్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీన్ని అందరూ వ్యతిరేకించాలని అన్ని పార్టీలను, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కేజ్రీవాల్ అభ్యర్థించారు. తెలుగు రాష్ట్రాల నుంచి బీఆర్ఎస్ కేజ్రీవాల్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచింది. వైసీపీ మాత్రం కేంద్రానికి మద్దతుగా నిలిచింది. పార్లమెంట్ సమావేశాలు నడుస్తున్న వేళ ఆప్ ఎంపీలు అన్ని పార్టీల

మిగతా 2లో...

# కాంగ్రెస్ జోష్‌కు బ్రేక్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తెలంగాణ కాంగ్రెస్ లో ఉత్సాహం నింపింది. జోష్' పెంచింది. అదే సమయంలో గత ఐదారు నెలలుగా, తెలంగాణ రాజకీయాల్లో కీలకం గా మారిన, బీఆర్ఎస్ బహిష్కృత మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అటూ ఇటూ ఊగి చివరకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో ఆ జోష్ మరికొంత పెరిగింది. అలాగే పొంగులేటితో పాటుగా బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఇంకా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోకపోయినా ఆయన పార్టీలో చేరడం కేవలం లాంఛనమే అని తేలిపోయింది.ఆయన పార్టీలో చేరినట్లే వ్యవహరిస్తున్నారు. పార్టీ సమావేశాల్లోనూ పాల్గొంటున్నారు. జూలై 30 కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సమక్షంలో కాంగ్రెస్ లో చేరేందుకు ముహూర్తం సైతం ఖరారైంది. కొల్లాపూర్లో జరిగే సభలో జూపల్లి కృష్ణారావు, ఆయన అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఇప్పటికే ప్రకటించారు. మరో వంక ఖమ్మంలో పొంగులేటి చేరిక సభను మరిపించేలా కొల్లాపూర్ సభను జయప్రదం చేయాలని తద్వారా పార్టీలో తన పట్టును పెంచుకునేందుకు జూపల్లి గట్టి పర్యటనలు చేస్తున్నారు. అయితే జూపల్లి చేరికను వ్యతిరేకిస్తున్న పాత కాంగ్రెస్ నాయకులు కొంత గుర్రుగా ఉన్నా, ఆయన తన దారిన తాను ముందుకు సాగుతున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడిన విధంగాన , రాజకీయ వాతావరణం కూడా కొంత చల్లబడినట్లు కనిపిస్తోంది. పొంగులేటి చేరిక నేపథ్యంగా తెరపైకొచ్చిన ఉచిత విద్యుత్ వివాదం విషయంలో అధికార

మిగతా 2లో...

### మళ్లీ ప్రియాంక టూర్
## వాయిదా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకుంటున్న జూపల్లి కృష్ణారావుకు పరిస్థితులు కలసి రావడం లేదు. కొల్లాపూర్‌లో భారీ బహిరంగసభ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 30వ తేదీన ప్రియాంకా గాంధీ వచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే వర్షాల కారణంగా సభను వాయిదా వేయక తప్పలేదు. వచ్చే నెల ఐదో తేదీన సభను నిర్వహించాలని నిర్ణయంచారు. ప్రియాంకా గాంధీ కొల్లాపూర్ సభ వాయిదా పడటం ఇది

మిగతా 2లో...

## ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసేలా విమర్శలొద్దు

- 135 చెరువులకు గేట్లు బిగించాం
- మూసి వరదను ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్నాం
- వరద పెరిగే ప్రాంతాల్లో ఉన్న పౌరులను అలర్ట్ చేస్తున్నాం
- పురపాలక శాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



హైదరాబాద్ నగరంలో జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయిలో ఉన్న కిందిస్థాయి సిబ్బంది వరకూ వర్షాలకు సంబంధించిన పనుల్లో అందరూ నిమఘ్నమయ్యారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పురపాలక ఉద్యోగుల అన్ని సెలవులను రద్దు చేయడం జరిగిందన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫోన్ల ద్వారా ఇతర మాధ్యమాల ద్వారా సమీక్షిస్తున్నామన్నారు. కుంభవృష్టిగా వర్షం పడడం.. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం వలన ప్రజలకు కొంత ఇబ్బంది ఎదురవుతోందన్నారు. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి ప్రాణా నష్టం జరగకుండా సాధ్యమైనంత ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. తమ ప్రధాన లక్ష్యం ప్రాణ నష్టం జరగకుండా చూడడమేనని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ కు రెడ్ అలర్ట్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తోందన్నారు. హైదరాబాద్ నగరంలో డిసిల్టింగ్ కార్యక్రమాన్ని

మిగతా 2లో...

### భారీ వర్షాలపై
## సీఎం కేసీఆర్ సమీక్ష



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రగతి భవన్ నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి ఆ చుట్టు పక్కల ప్రాంతాలలో భారీ వర్షం కురుస్తోంది. కొన్ని చోట్ల 62 సెం. మీ ల వర్షపాతం, 47 సెం. మీల వర్షం ఇలా భారీ వర్షపాతాలు నమోదయ్యాయి. మోరంచపల్లి గ్రామం పూర్తిగా నీట మునిగింది. గ్రామంలో సహాయక

మిగతా 3లో...

### సమగ్ర పోషకాల ద్వారానే
## సుస్థిర వ్యవసాయం
### కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

జూలై 27న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 125000 ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను దేశానికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ వారు దేశ వ్యాప్తంగా 9 కేంద్రాలను ఎంపిక చేశారు. ఇందులో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ షామీర్ పేటలో ఏర్పాటుచేసిన పిఎం కేఎస్ కే కి చోటు లభించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి పాల్గొని పి యం

మిగతా 4లో...

## ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందుల తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు, ఎస్.పి లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు వెల్లడించారు. మేరకు భారీ వర్షాలు, వరదల వల్ల ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడానికి ఎన్డీఆర్ఎఫ్, ఎస్,డీ.ఆర్.ఎఫ్, ఫైర్ తదితర శాఖల ఎమర్జెన్సీ బృందాలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటికే సచివాలయంలో వర్షాలు, వరద పరిస్థితులు, సహాయ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూమ్ లో ప్రత్యేకంగా ముగ్గురు సీనియర్ అధికారులును నియమించి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కంట్రోల్ రూమ్ లో 7997950008 , 7997959782 , 040 - 23450779 అనే నెంబర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు అదేవిధంగా అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్ లను

మిగతా 2లో...

### చంద్రయాన్..
## నాలుగు లక్షల కిలోమీటర్ల ప్రయాణం
### ఆగస్టు 1 నాటికి చంద్రుడి గురుత్వాకర్షణ



బెంగళూరు- ప్రభాత సూర్యుడు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 విజయవంతంగా ఐదు దశలను పూర్తి చేసుకుని చంద్రుడివైపు వేగంగా కదులుతోంది. భూగురుత్వాకర్షణ పరిధిని దాటి ప్రస్తుతం చంద్రుడి వైపు సాగుతోంది చంద్రయాన్-3. తదుపరి చేపట్టే దశలు అన్నీ చంద్రయాన్-3 ప్రయోగానికి కీలకమే అని ఇస్రో

మిగతా 2లో...

## భారీ వర్షాలపై సీఎం కేసీఆర్ సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)
చర్యల కోసం హెలికాప్టర్ ను తరలించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం ఇచ్చారు. సికింద్రబాద్ కంటోన్మెంట్ మిలట్రీ అధికారులతో చీఫ్ సెక్రటరీ శాంతా కుమారి సంప్రదింపులు జరిపారు. సహాయక చర్యల్లో సాధారణ హెలికాప్టర్ల సేవలు వినియోగించుకోవడం కష్టం అవుతుండటంతో సైన్యంతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. ఇప్పటికే మోరంచపల్లికి తరలిన నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్ ళిఎన్డీఆర్ఎఫ్ బృందాలుర. ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సంప్రదిస్తూ పరిస్థితిని సీఎం కేసీఆర్ కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అందిస్తున్నారు. ఇతర వరద ముంపు ప్రాంతాల్లో కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు.

## ఢిల్లీ సర్వీసు బిల్లుకు వైసీపీ మద్దతు

(మొదటిపేజీ తరువాయి)
ప్రతినిధులతో సమావేశమయ్యారు. కేంద్రం తీసుకువస్తున్న సవరణ బిల్లును వ్యతిరేకించాలని కోరుతున్నారు. ఈ మధ్య కాలంలో వైసీపీ ఎంపీలకు దీనిపై జగన్ క్లారిటీ ఇచ్చారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి ఢిల్లీలో చెప్పారు. బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి తెలిపారు. రాష్ట్రాలు ఏకం కావాలని ఆప్ చేసిన విజ్ఞప్తి గురించి మీడియా అడిగినప్పుడు విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ పూర్తి స్థాయి రాష్ట్రంగా ఉంటే తాము వారికి మద్దతు ఇచ్చేవాళ్లం. ఈ సందర్భంలో ఇది పూర్తి రాష్ట్రం కాదు, అందులోని చాలా ప్రాంతాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రాక ముందు నుంచి కూడా కేంద్రానికి వైసీపీ అనుకూలంగానే ఉంది. అవసరమైనప్పుడల్లా బీజేపీకి మద్దతుగా నిలుస్తోంది. ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు లోక్‌సభలో 22 మంది ఎంపీలు ఉంటే రాజ్య సభలో 9మంది సభ్యులు ఉన్నారు. "సమాఖ్య నిర్మాణం గురించి మాట్లాడితే గతంలో కాంగ్రెస్ కూడా చాలాసార్లు ఉల్లంఘించిందని" వైఎస్ఆర్ ఎంపీలు గుర్తు చేస్తున్నారు. వైసీపీ ప్రకటనతో ఎన్డీఏకు రాజ్యసభలో సంఖ్యాబలం పెరిగింది. 237 మంది పార్లమెంటు సభ్యుల సభలో ఓటు వేయాల్సి ఉండగా, ప్రతిపక్ష కూటమికి వచ్చే 108 ఓట్లకు వ్యతిరేకంగా ఎన్డీయేకు 123 ఓట్ల మెజారిటీ ఉంది. ఇందులో 92 మంది బీజేపీ ఎంపీలు, వారి భాగస్వాములైన అన్నాడీఎంకే సహా ఇతర చిన్న పార్టీలు ఉన్నాయి. తొమ్మిది మంది ఎంపీలతో బిజూ జనతాదళ్ కూడా ఎన్డీయేకు అనుకూలంగా ఉండే ఛాన్స్ ఉంది. వచ్చేవారం పార్లమెంట్‌లో ఢిల్లీ అధికారాలకు సంబంధించిన బిల్లు రాగానే వ్యతిరేకంగా ఓటు వేయాలని భారతీయ రాష్ట్ర సమితి బీఆర్ఎస్ తన 7 మంది ఎంపీలకు విప్ జారీ చేసింది. పార్లమెంటు సభ్యులందరూ జూలై 26, 27, 28 తేదీల్లో సభలో ఉండాలని బిల్లుపై ఓటింగ్ ముగిసే వరకు సభలోనే ఉండాలని విప్‌లో ఆ పార్టీ సూచించింది. ఢిల్లీలో బ్యూరోక్రసీపై కేంద్రం నియంత్రణ ఉండేలా కేంద్రం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనికి సంబంధించిన బిల్లు ముసాయిదాను మే 19న కేంద్రం కేబినెట్ ఆమోదించింది. పోలీసు, పబ్లిక్ ఆర్డర్, భూమికి సంబంధించిన విషయాలు మినహా రాజధానిలో బ్యూరోక్రసీ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి అప్పగించాలని గతంలో సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్ ఇచ్చింది. దాన్ని సమర్థిస్తూ సవరణ బిల్లు సిద్ధం చేసింది. దాన్ని వచ్చే వారం ఆమోదానికి సభ ముందు పెట్టబోతోంది.

## సమగ్ర పోషకాల ద్వారానే సుస్థిర వ్యవసాయం

(మొదటిపేజీ తరువాయి)
కెఎస్ కేఎస్ ప్రాముఖ్యతను కేంద్ర ప్రభుత్వం రైతులకు చేసే సేవలను ఎరువుల పైన గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు జీవీ సుబ్బారెడ్డి బిజినెస్ హెడ్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన 500 మంది పైగా రైతులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి సల్ఫర్ కోటెడ్ యూరియాను ఆవిష్కరించారు. మరియు పిఎం కిసాన్ నిధుల 14వ విడత పంపిణీలో భాగంగా 8.5 కోట్ల రైతులకు 17, 500 కోట్ల విడుదల చేశారు. కోరమండల్ సంస్థ ప్రతినిధులు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటుచేసిన 4200 పిఎంకెఎస్కే కేంద్రాలలో కార్యక్రమం యొక్క ప్రత్యక్ష ప్రసారాన్ని రైతుల కోసం ప్రదర్శించారు సుస్థిర వ్యవసాయం మరియు సమగ్ర పోషక యాజమాన్యం గురించి వివరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ జీవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిఎంకెఎస్కే కేంద్రాల ద్వారా భూసార పరీక్ష మరియు విస్తరణ సేవలు వినియోగించుకోవాల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు. బిజినెస్ హెడ్ మాధవ్ మాట్లాడుతూ కోరమండల్ సంస్థ వారు రైతులకు శ్రేష్టమైన ఎరువులను సూక్ష్మ పోషకాలను మరియు సేంద్రియ ఎరువులను తగిన మోతాదులో అందించడం ద్వారా రైతుల ఆర్థిక పూర్వకమణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి భాస్కర్ రెడ్డి, డాక్టర్ వినయ్ కుమార్ పరీడ, డాక్టర్ సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పి ప్రసాద్, డివిఎల్ఎన్ రాజు, అవినాష్, వినయ్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసేలా విమర్శలొద్దు

(మొదటిపేజీ తరువాయి)
ఎప్పుడో పూర్తి చేశామన్నారు. దీంతో పాటు చెరువుల బలోపేతం చేసే కార్యక్రమాలు కూడా చేపట్టామన్నారు. 135 చెరువులకు గేట్లు బిగించామని, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు అధికారులు సిబ్బంది కూడా విస్తృతంగా పనిచేస్తున్నారన్నారు. గతంలో ఇలాంటి భారీ వర్షాలు పడితే అనేక ప్రాంతాలు జలమయం అయ్యేది. అయితే ఈసారి నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా చేపట్టిన కార్యక్రమాల వలన వరద ప్రభావం కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఆయా ప్రాంతాల్లో వరద సమస్య బాగా తగ్గింది. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సిబ్బంది 24 గంటలు ఈ భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు పనిచేస్తోంది. ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు మాని భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి. భారీ వర్షాల్లో నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసే విధంగా చిల్లర విమర్శలు చేయవద్దు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు వర్షాన్ని ఎదుర్కొనేందుకు పనిచేస్తున్నాయి వారి మనో ధైర్యం దెబ్బతినకుండా నాయకులు మాట్లాడితే బాగుంటుంది. వరద పెరిగే ప్రాంతాల్లో ఉన్న పౌరులను అలర్ట్ చేస్తున్నాం. ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తూ తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నాం. చెరువులకు గండి పడే ప్రమాదం ఉంటే వాటిని కూడా సమీక్షిస్తున్నాం.

మూసి వరదను ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్నాం. వర్షాలు తగ్గుముఖం పట్టగానే వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం. వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించాం. అవసరమైతే రేపు నేను కూడా స్వయంగా వెళ్తానని కేటీఆర్ పేర్కొన్నారు.

## జేఆర్ సీ కన్వెన్షన్ హాలుకు అమిత్ షా

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**
బీజేపీ అగ్ర.నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఖరారైంది. ఎల్లుండి శనివారం అమిత్ షా హైదరాబాద్ కు రానున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3:45 గంటలకు ప్రత్యేక విమానంలో అమిత్ షా హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు జేఆర్‌సీ కన్వెన్షన్‌లో వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు, మేధావులు, ఉద్యమకారులు, కవులు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, సామాజిక సంఘాల నాయకులతో భేటీ అవుతారు. తర్వాత సాయంత్రం 5:15 గంటలకు శంషాబాద్‌లోని నోవాటెల్‌కు వస్తారు. 5:15 నుంచి 8 గంటల వరకు పార్టీ ముఖ్య నేతలతో భేటీ అవుతారు. అనంతరం రాత్రి తిరిగి ఢిల్లీ వెళ్తారు. ఇదిలా ఉండగా అమిత్‌షా పర్యటన సందర్భంగా ఈనెల 29న ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర బీజేపీ ప్లాన్ చేస్తోంది. కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది.

# ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం

(మొదటిపేజీ తరువాయి)
ఏర్పాటు చేశామని వెల్లడించారు.
కొత్తగూడెం , హైదరాబాద్ లలో రెండు చొప్పున ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, ములుగు, వరంగల్ లో ఒక్కొక్క బృందం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉత్తర తెలంగాణా జిల్లాల్లో గత రాత్రి నుండి కొన్ని ప్రాంతాల్లో 40 సెంటీ మీటర్ల నుండి 30 సెంటి మీటర్ల వరకు వర్షం కురిసిందని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలోని మోరంచ వాగు ఉప్పొంగడం వల్ల మోరంచపల్లి గ్రామం పూర్తిగా నీట మునిగి ఒదని, ఈ గ్రామంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని అన్నారు. మోరంచపల్లి గ్రామానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని పంపిస్తున్నామని, రక్షణ, పునరావాస చర్యలకు సహకరించేందుకు హెలికాప్టర్ కూడా పంపించేందు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. భూపాల పల్లి జిల్లా కలెక్టర్, ఎస్.పి లు మోరంచపల్లి గ్రామ ప్రజలతో మాట్లాడుతూ పరిస్థితులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అదేవిధంగా, ములుగు జిల్లా ముత్యాల ధారా జలపాతంలో చిక్కుకు పోయిన 80 మంది పర్యాటకులను రాత్రి వంటి గంట ప్రాంతంలో సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని తెలిపారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఒక రెసిడెన్షియల్ పాఠశాలలో నీరు చేరడంతో అక్కడి పిల్లలను ఇతర పాఠశాలలకు తరలిస్తున్నట్టు తెలిపారు. వరంగల్. హన్మకొండ పట్టణాలలో భారీ వర్షాల వల్ల అనేక కాలనీలు, బస్తీలు నీట మునిగాయని, ఈ బస్తీలనుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలియ చేశారు.

భద్రాచలం వద్ద గోదావరి నదీ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెండవ ప్రమాద సూచిక జరీ చేశామని, మూడవ ప్రమాద సూచీని ఎప్పుడైనా ప్రకటించే అవకాశమున్నందున, ముంపుకు గురయ్యే గ్రాలనుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. కడెం ప్రాజెక్ట్ ద్వారా అధిక పరిమాణంలో జలాలు విడుదల అవుతున్నందున అక్కడి పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని సి.ఎస్ వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్ల, పోలీస్ కమిషనర్లు, ఎస్.పి లతో ప్రతీ గంట గంటకు పరిస్తుతులను టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నిండి మత్తడి పోస్తున్న చెరువులు, కుంటల వద్ద ప్రత్యేక చర్యలను చేపట్టామని, కాల్వలు, కాజ్ వే లాగుండా ప్రయాణం సాగించవద్దని ప్రజలకు సూచించారు. సచివాలయం నుండి వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్.ఓ.డి లు కూడా పరిస్థితులను సమీక్షిస్తున్నారని వివరించారు.

## మళ్లీ ప్రియాంక టూర్ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)
రెండో గతంలో గతంలో ఇరవయ్యో తేదీన సభను నిర్వహించాలనుకున్నారు. కానీ ప్రియాంకా గాంధీ బిజీగా ఉండటంతో వాయిదా పడింది. ఈసారి ప్రియాంకాగాంధీ సమయం ఇచ్చినా వర్షాల కార ణంగా వాయిదా వేయక తప్పలేదు. కొల్లాపూర్ సభలో బల ప్రదర్శన చేసేందుకు జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి మహబాబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా తన అనుచరుల్ని పార్టీలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సభలోనే మహిళల అభ్యున్నతి కోసం ప్రియాంక గాంధీ మహిళా డిక్లరేషన్ ప్రకటించేందుకు ఏర్పాట్లు చేశారు. కొల్లాపూర్ సభలో పెద్ద ఎత్తున చేరికలకు కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు రాజేష్‌రెడ్డి, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత తదితర అనేక మంది నేతలు కాంగ్రెస్ తీర్థం తీసుకోనున్నారు. పాలమూరు ప్రజా భేరి పేరుతో సభ నిర్వహించి మూడు లక్షల మంది జన సమీకరణ చేయాలని టార్గెట్ గా పెట్టుకున్నారు. ఆగస్టు 14వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో సభ నిర్వహిస్తున్నారు. ఆ సభకు టార్గెట్ నిర్దేశించేలా భారీగా జన సమీకరణ చేయాలనుకుంటున్నారు. యావత్తు తెలం గాణ రాష్ట్రానికి వినపడేటట్టుగా, కనపడేటట్టుగా పాలమూరు ప్రజాభేరీ సభను నిర్వహిం చుకుందామని జూపల్లి కృష్ణారావు గట్టిగా శ్రమిస్తున్నారు. వారం రోజులు మాత్రమే సభ వాయిదా పడిందని.. సభను అనుకున్న విధంగా విజయవంతం చేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

జూపల్లి కృష్ణారావు ఇటీవలి వరకూ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల జనార్దన్ రెడ్డి కూడా బీఆర్ఎస్ లోనే ఉన్నారు. కానీ పార్టీలో ఉన్న అంతర్గత రాజకీయాల కారణంగా కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయిం చుకున్నారు. జూపల్లిని ముందుగానే సస్పెండ్ చేశారు. దీంతో వారు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి జిల్లాలో ఒక్క సీటు కూడా రాకుండా చూస్తామని చాలెంజ్ చేస్తున్నారు. టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కూడా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వారే కావడంతో.. అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని సభను సక్సెస్ చేయాలని అనుకుంటున్నారు. రెండు సార్లు వాయిదా పడటంతో.. జూపల్లి వర్గీయులు నిరుత్సాహపడినా.. తర్వాత సభను విజయవంతం చేస్తామని నమ్మకంతో ఉన్నారు.

## ఆగస్టు నాటికి గులాబీ జాబితా

(మొదటిపేజీ తరువాయి)
ప్రకటిస్తానని, మిగిలిన 59 మంది అభ్యర్థులను ఆగస్టు 24న ప్రకటిస్తానని కెసీఆర్ సెలవిచ్చారు. ఆగస్టు 24వ తేదీన ప్రకటించడానికి కెసీఆర్ ఓ లాజిక్ కూడా చెప్పారు రెండు తేదీలు కలిపి తన అదృష్ట సంఖ్య 6ని చెప్పారు. అయితే కెసీఆర్ ఇలా తొందరపడి అభ్యర్థులను ఎన్నికల నోటిఫికేషన్ కు ముందే ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారి తీసింది. దాదాపు 14 మంది మంత్రులు, ఇతర పార్టీల నుంచి మారిన 16 మంది ఎమ్మెల్యేలకు తొలి దశలో టిక్కెట్లు దక్కే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. కేసీఆర్ తో సహా 31 మందికి తొలి దశలో సీట్లు వస్తాయి అని ప్రచారం జరుగుతోంది. సర్వే నివేదికలను బట్టి జాబితాను మార్చడానికి పార్టీ అధినేతకు అవకాశం, సమయం ఉంటుందని బిఆర్ ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఎన్నికల్లో కొత్త ముఖాలను రంగంలోకి దింపాలని కేసీఆర్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌లో టిక్కెట్ల కోసం డిమాండ్ ఉన్న నేపథ్యంలో వామపక్ష పార్టీలతో ముందస్తు ఎన్నికల పొత్తుకు కేసీఆర్ సిద్దంగా లేరు అని తెలుస్తోంది.

గత అనుభవాలను పరిశీలిస్తే ఎన్నికలు అనగానే కేసీఆర్ కు ఉత్సాహం ఉరకలేస్తుంది. 2019 జూన్‌లో పదవీకాలం ముగియడానికి తొమ్మిది నెలల ముందే అంటే 2018 సెప్టెంబర్ 6న అసెంబ్లీని రద్దు చేసారు. అదే రోజు 105 స్థానాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పట్లో సెప్టెంబర్ 6న ప్రకటించడానికి కారణం లేకపోలేదు. 6 కెసీఆర్ లక్కీ నెంబర్. అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించే కేసీఆర్ ఈ సారి కూడా తొలి జాబితాను ప్రకటించడానికి ఉవ్విళూరుతున్నారు. ఎన్నికలు జరగడానికి ఇంకా చాలా సమయం ఉంది. ఆగస్టు 24లోపు రెండు జాబితాలను ప్రకటిస్తానని ప్రకటించి అన్ని పార్టీలను అబ్బురపరుస్తున్నారు. మెజారిటీ రాజకీయ పార్టీలు సాధారణంగా అభ్యర్థుల జాబితాను ముందే ప్రకటించకుండా సస్పెన్స్ కొనసాగిస్తాయి. నోటిఫికేషన్ వచ్చాక అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తాయి. చివరి క్షణం వరకు ఉత్కంఠ నెలకొనేలా చేస్తాయి.

## చంద్రయాన్.. నాలుగు లక్షల కిలోమీటర్ల ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)
అధికారులు చెబుతున్నారు. ఆగస్టు 1, 2023 నిర్దేశించిన ప్రకారం చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించనుంది. ఈ మిషన్ లో ఇది కీలకమైన దశగా ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ దశలో చంద్రయాన్-3 చంద్రుని గురుత్వాకర్షణ పరిధిలోని కక్ష్యలోకి చేరుతుంది. క్రమంగా ఈ కక్ష్య పరిధిని కుదించుకుంటూ చంద్రునికి దగ్గరగా వెళ్తుంది. 1,27,609 కి.మీ లీ 236 కి.మీ కక్ష్యను చేరుకుని క్రమంగా చంద్రునికి దగ్గరగా వెళ్తుంది. అలా ఆగస్టు చివరి నాటికి చంద్రునికి 30 కిలోమీటర్ల దగ్గరి వరకు వెళ్తుంది. ఆ సమయానికి చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతానికి చేరుకున్న తర్వాత అసలు సిసలు పరీక్ష ప్రారంభం అవుతుంది. చంద్రయాన్-3 రోవర్ సాఫ్ట్ ల్యాండింగ్ అవుతుంది. అనుకున్నది అనుకున్నట్లు ప్రణాళికబద్ధంగా జరిగితే చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన నాల్గో దేశంగా భారత్ నిలవనుంది. రష్యా, అమెరికా, చైనా తర్వాత చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన 4వ దేశంగా భారత్ రికార్డులకెక్కనుంది. చంద్రయాన్ 3ని బాహుబలి రాకెట్‌గా చెప్పిన ఇస్రో ఆ తరవాత దానికి ఒజీబీనిఇష్ర ఎవష్ట్రతిఇశ్రీవ ఓజీతీని 3 గా పేరు పెట్టింది. దీని బరువు 642 టన్నులు. బరువు 3,921 కిలోలు. భూమి నుంచి చంద్రుడి వరకూ దాదాపు 4 లక్షల కిలోమీటర్ల వరకూ ప్రయాణిస్తుంది. 24 రోజుల పాటు ఇది భూమి చుట్టూ ప్రదక్షిణలు చేయనుంది. ఆగస్టు 23 లేదా 24 న చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ అవుతుందని ఇస్రో అంచనా వేస్తోంది. ల్యాండర్, రోవర్ మాడ్యూల్ వేరువేరుగా ఉన్న ఈ స్పేస్ క్రాఫ్ట్ చంద్రుడి సౌత్ పోల్ కి సమీపంలో ల్యాండ్ అవ్వనుంది. ప్రపొల్షన్ మాడ్యూల్ భూమి చుట్టూ పలుసార్లు తిరిగి చంద్రుడిపై దిగుతుంది. చంద్రుడిపై గ్రావిటీకి తగ్గట్టుగా మాడ్యూల్ మెల్లగా కిందకు దిగుతుంది. ల్యాండర్ విడిపోతుంది. లాంఛ్ అయినప్పటి నుంచి సరిగ్గా నెల రోజుల తరవాత చంద్రుడిపై మాడ్యూల్ దిగుతుంది. చైనా, రష్యాలు జంబో రాకెట్లను ఉపయోగించి చంద్రుడిపైకి ఉపగ్రహాలను పంపించాయి. చైనా, అమెరికా దాదాపు రూ.1000 కోట్ల వరకు ఖర్చు చేస్తుండగా.. ఇస్రో మాత్రం రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లతోనే ప్రయోగం చేపడుతోంది. చంద్రుడి కక్ష్య వరకు వెళ్లే శక్తివంతమైన రాకెట్ సైతం ఇస్రో వద్ద లేకపోయినా క్లిష్టమైన ప్రక్రియలో ప్రయోగం చేపట్టింది. భారత్ సత్తా ప్రపంచమంతా చాటేలా ప్రయోగం చేసింది. ఇటలీలోని మన్సియానోకు చెందిన వర్చువల్ టెలిస్కోప్ ప్రాజెక్ట్ అంతరిక్షంలో తిరుగుతూ చంద్రుడి వైపు ప్రయాణిస్తున్న చంద్రయాన్-3ను చిత్రీకరించింది. అందులో చంద్రయాన్-3 ఓ చుక్కలా వేగంగా ప్రయాణిస్తోంది. భూమికి 341 కిలోమీటర్ల ఎత్తులో చంద్రయాన్-3 కదలికలను వర్చువల్ టెలిస్కోప్ గుర్తించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యింది. ఇటలీకి చెందిన ఈ వర్చువల్ టెలిస్కోప్ ఖగోళానికి చెందిన పలు విషయాలను ఎప్పటికప్పుడు గుర్తించి సమాచారం ఇస్తూ ఉంటుంది. చంద్రయాన్-3 విషయంలోను ఈ టెలిస్కోప్ తన పనితనం, నైపుణ్యం ప్రదర్శించింది.

## సంపాదకీయం

# కనిపించని అమ్మాయిలు ఎక్కడ

దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళలకు మిస్సవుతున్న ఘటనలు చోటుచేసుకుంటేనే ఉన్నాయి. అందులో కొన్ని కేసులను పోలీసులు ఛేదిస్తే చాలావరకు కేసులు ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయిన పరిస్థితి ఉంది. ఈ మిస్సింగ్ కేసు ఘటనలు చాలావరకు ఓ మిస్టరీగానే ఉండిపోతున్నాయి. ఎవరూ, ఎక్కడ, ఎందుకు కిడ్నాప్ చేస్తున్నారనే విషయాలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా పోయింది. అయితే దేశంలో మహిళల మిస్సింగ్ కేసులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక విషయాలు వెల్లడించింది. మహిళల మిస్సింగ్ కేసుల్లో మానవ అక్రమ రవాణా బారిన పడుతున్న వారే ఎక్కువ.మానవ అక్రమ రవాణాలో శ్రమ, లైంగిక దోపిడీ ప్రధానంగా కనిపిస్తున్నాయి. విద్య, ఉపాధి అవకాశాలు లేకపోవడం, బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం కూడా కారణాలుగా కనిపిస్తున్నాయి.ఈ మిస్సింగ్ కేసుల నమోదు దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండే అవకాశం లేదు. కొన్ని ప్రాంతాల్లో తక్కువ కేసులు, మరికొన్ని ప్రాంతాల్లో చాలా ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి.దేశంలో కొన్ని ప్రాంతాల్లో మిస్సింగ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. అలాంటి ప్రాంతాలు, మానవ అక్రమ రవాణాకు ప్రారంభ స్థానంగా గానీ, లేదంటే గమ్యస్థానంగా గానీ ఉంటున్నాయి. అలాంటి చోట ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి.దేశంలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుంచి సేకరించిన సమాచారంతో ప్రచురించే 'క్రైమ్ ఇన్ ఇండియా' నుంచి వివరాలు సేకరించి ఎన్సీఆర్బీ రిపోర్ట్ రూపొందిస్తోంది.దేశంలోని మహిళల మిస్సింగ్ కేసులో మహారాష్ట్ర టాప్‌లో ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.2021లో మహారాష్ట్రంలో 56,498 మంది మహిళలు మిస్ అయ్యారని చెప్పారు. ఈ మిస్సింగ్ కేసుల్లో టాప్ 5 రాష్ట్రాలుగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, అస్సాం రాష్ట్రాలు నిలిచాయి. ఇటు తెలుగు రాష్ట్రాల్లో గడిచిన మూడేళ్లలో 72,767 మంది అదృశ్యం అయినట్లు కేంద్రం తెలిపింది.ఏపీలో 2019 నుంచి 2021 వరకు మూడేళ్ల కాలంలో మొత్తం 7,928 బాలికలు.. 22,278 మహిళలు అదృశ్యమైనట్లు పేర్కొంది.2019లో 2,186 బాలికలు 6,252 మహిళలు2020లో 2,374 బాలికలు 7,057 మంది మహిళలు2021లో 3,358 బాలికలు, 8,969 మంది మహిళలు అదృశ్యమైనట్లు కేసులు నమోదైనట్లు పేర్కొంది.అటు తెలంగాణలో సైతం మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులు మరింత ఎక్కువగా ఉన్నట్లు హోంశాఖ గణాంకాలు వెల్లడించాయి. 2019 నుంచి 2021 వరకు మూడేళ్లలో తెలంగాణలో మొత్తం 8,066 మంది బాలికలు, 34,495 మహిళలు అదృశ్యమయ్యారు.2019లో 2,849 మంది బాలికలు, 10,744 మహిళలు2020లో 2,232 మంది బాలికలు, 10,917 మంది మహిళలు 2021లో 2,994 మంది బాలికలు 12,834 మంది మహిళలు మిస్సయినట్లు కేసులు నమోదయ్యాయని కేంద్రం తెలిపింది.కుటుంబ సభ్యులు నిత్యం కలిసి సంతోషంగా జీవిస్తుంటారు.. వారిలో ఒకరు అదృశ్యమైతే ఆ బాధ అంతాఇంతా కాదు. అదే ఆడబిడ్డ అదృశ్యమైతే సమాజంలో ఏమి చెప్పాలో తెలియని మరింత బాధ. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే వారు మృతి చెందారని కొంతకాలం కుమిలిపోయి ఆ బాధను క్రమేపీ మర్చిపోతారు. అదృశ్యమైన వారి విషయంలో ప్రతిక్షణం నరకయాతన ఆ కుటుంబ సభ్యులు అనుభవించాల్సిందే. అదృశ్యమైన ఆడబిడ్డ వయస్సు కల్గిన వారు ఎవరు కనబడ్డా వారి మనస్సులను తొలచివేస్తుంది. తమ బిడ్డ ఎక్కడ ఉందోనని రకరకాల ఆలోచనలు వెంటాడుతాయి. బంధువుల వద్దకు వెళ్లినా బిడ్డ దొరికిందా అంటూ వారు ఆప్యాయతగా అడిగినా ఆ మాట గుండెల్లో పొడిచినట్టు అనిపిస్తుంది. అసలు మా బిడ్డ ఎక్కడ ఉన్నా ప్రాణాలతో సుఖంగా ఉంటే చాలని చిరు ఆశతో ఆ బిడ్డ పలుకు కోసం పరితపిస్తూ ఈ రోజు కాపోతే రేపైనా ఫోన్ చేస్తుందని ఆశగా ఎదురుచూస్తూ జీవితాలను గడిపేస్తున్నవారు అనేక మంది ఉన్నారు.మరోవైపు ఏపీలో భారీ ఎత్తున మహిళలు అదృశ్యం కావడానికి వాలంటీర్లు తీసుకుంటున్న డేటాయే కారణమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గతంలో ఆరోపించారు. దీనిపై ప్రభుత్వంతో మహిళా కమిషన్ కూడా తీవ్రంగా స్పందించాయి. పవన్ కేంద్ర ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం తాను చెప్పానని చెప్పడాన్నీ తప్పుబట్టాయి. ఐబీ పవన్ కళ్యాణ్ కు డేటా ఎలా ఇచ్చిందని కూడా ప్రశ్నించాయి. మరి ఇప్పుడు కేంద్రమే పార్లమెట్ సాక్షిగా అదృశ్యమైన వారి వివరాలు తెలిపింది. మరి దీనికి వైసీపీ నేతలు ఏమని సమాధానం చెపుతారని జనసేన శ్రేణులు ప్రశ్నిస్తున్నారు.2019-21 మధ్య 30వేల మంది బాలికలు,మహిళలు అదృశ్యమయ్యారని కేంద్రమంత్రి చెప్పారని.. ఇప్పుడు మహిళా కమిషన్ ఏం చేస్తుందని ప్రశ్నించారు జనసేన అధినేత పవన్ కల్యాణ్.. బాలికలు, మహిళలు ఎందుకు అదృశ్యమవుతున్నారని ప్రశ్నించారు. దీనిపై హోంమంత్రి , డీజీపీని.. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ వివరణ అడగగలదా? చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వంపై మహిళా కమిషన్ చర్యలు తీసుకోగలదా చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ పాలనలో భారీగా బాలికలు, మహిళలు అదృశ్యం అయ్యారని పేర్కొన్నారు పవన్ కల్యాణ్.. 2019-21లో 7,928 మంది బాలికలు, 22,278 మంది మహిళలు అదృశ్యం అయ్యారు.. అసలు బాలికలు, మహిళలు ఎందుకు అదృశ్యమౌతున్నారు? అని ఆవేదన వ్యక్తం చేశారు జనసేన అధినేత పవన్ కల్యాణ్.

# స్కూళ్లు సోమవారమే


హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో మరో రెండురోజుల పాటు వర్షాలు బీభత్సం సృష్టించనున్నాయని ఐఎండీ హెచ్చరించింది. తెలంగాణ వ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించింది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమై ముందుగా విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించింది. ఇప్పటికే వర్షాల కారణంగా వరుసగా రెండు రోజులు సెలవులు వచ్చాయి. ఇప్పుడు శుక్రవారం కూడా సెలవు ప్రకిటించడంతో వరుసగా ఐదు రోజులు సెలవులు వచ్చినట్టు అవుతుంది. అతిభారీ వర్షాల రాష్ట్రంలోని అన్ని రకాల విద్యాసంస్థలకు ( శుక్రవారం) సెలవు ప్రకటించాలని, అందుకు సంబంధించి తక్షణమే ఉత్వర్వులు జారీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆదేశించారు. శుక్రవారం సెలవులు ఇవ్వాలని అన్ని విద్యాసంస్థలకు సూచనలు చేశారు. 28వ తేదీన హాలీడే ప్రకటించడంతో తర్వాత రోజు 29వ తేదీన మొహర్రం పండుగ ఉంది. 30వ తేదీన ఆదివారం రానే వచ్చింది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం 28వ తేదీన మొహర్రం పండగ, 29వ తేదీన మొహర్రం జనరల్ హాలీడే గాఉంది. అయితే 28న చాలా మంది ఆప్షనల్ హాలీడేగా ఇచ్చేస్తారని అనుకున్నారు. కానీ ప్రభుత్వమే సెలవు ప్రకటించింది. 29న సెలవు స్కూళ్లకు వర్తించనుంది. 30న ఎలాగూ ఆదివారం కాబట్టి వరుసగా మొత్తం ఐదు రోజులు సెలవులు వచ్చాయి.

# జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు

## జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

జగిత్యాల - ప్రభాత సూర్యుడు



జిల్లాలో కురుస్తున్న వర్షాల వలన ప్రాణ నష్టం వాటిల్లకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం రోజున తన క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా జిల్లా, మండల అధికారులు, పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ శాఖ జిల్లాను రెడ్ అలర్ట్ గా ప్రకటించిందని, రానున్న 24 గంటలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళికలతో సమన్వయంతో ఉండి, లోతట్టు, నీటి పరివాహక ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. జిల్లాలో 6 మండలాల్లోని 30 గ్రామాలు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నందున, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడం ద్వారా నీటి ప్రవాహం వలన సమస్యలు రావడం జరుగుతాయని, ఆ గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అన్నారు. ప్రతీ మండలంలో సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాలలో భోజనం, త్రాగు నీరు, బ్లాంకెట్లు, మందులు, వైద్య సిబ్బంది, తదితర ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఇప్పటికే 90 గ్రహాలలోని 296 మందిని సహాయ పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని తెలిపారు. తక్కువ ఎత్తు గల బ్రిడ్జి లపై నుండి ప్రవహించే ప్రాంతాల్లో రవాణా ఆపివేసి, బారి కెడ్స్ ఇరువైపుల ఏర్పాటు చేయాలని, ట్రాక్టర్లను అడ్డుగా కోట దూరం లో పెట్టలనీ సూచించారు. జిల్లాలోని చెరువుల్లో నీటి పరిమాణం లను గుర్తించి ప్రమాద స్థాయిలో ఉన్న చెరువు ప్రాంతాలలో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. జిల్లాలో 1064 చెరువులకు గాను, ఇప్పటి వరకు 877 చెరువులు సర్ ప్లస్ నీరు చేరిందని తెలిపారు. ఈ సమయంలో నైనా చెరువులు తెగిపోయే పరిస్థితులను గమనిస్తూ సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. వసతి గృహాల్లోనీ పిల్లలకు సౌకర్యాలు అందించాలని అన్నారు. గ్రామాల్లో పిల్లలు నీటి పరివాహక ప్రాంతాలలో సెల్ఫీ లు తీసుకోవడం జరుగుతున్నదని, వర్షాల వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, సేల్ఫీ లు తీసుకోకుండా నిరోధించాలని సూచించారు. చేపలు పట్టేందుకు నీటి ప్రవాహాలకు అడ్డుగా వలలను వేస్తున్నట్లు అధికారులు తెలుపడంతో, వలల వలన నీటి ప్రవాహానికి అడ్డుగా ఏర్పడుతుందని, అట్టి వాటిని తొలగించాలని జిల్లా మత్స్య శాఖ అధికారి నీ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా టామ్ టామ్ నిరంతరంగా నిర్వహించాలని పంచాయతీ, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ లు వారి పరిధిలో పర్యటించి వరద పరిస్థితులు, సహాయ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించాలని అన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అలాగే ఎస్సారెస్పీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వేసే అవకాశం ఉన్నందున గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. రాత్రి వేళల్లో నీటి ఉధృతి పెరగడం జరుగుచున్నది, రాత్రి వేళల్లో విధులు నిర్వహించేందుకు టార్చ్ లైటు, తాడు, జాకెట్, ఈతగాళ్ల లను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 75 ప్రాంతాలలో స్ట్రీమ్స్ తెగిపోయాయని, ఆయా ప్రాంతాల్లో వాహనాలు, ప్రజలు తిరుగకుండా బారికెడ్స్ ఏర్పాటు చేసి, పోలీసులు గస్తీ ఏర్పాటు చేయడం జరిగాయని తెలిపారు.ఆనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ, ఎట్లాంటి సంఘటనలు జరుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడం, ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. సెల్ఫి తీసుకోకుండా నిరోధించాలని, చేపల వేటకు వెళ్లే వాళ్ళను ఆపివేయాలని , సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి, సౌకర్యాలు కల్పించాలని అన్నారు.ఆనంతరం అదనపు కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ పనులకు ఎవరు కూడా వెళ్లకుండా గ్రామాలలో టామ్ టామ్ చేయాలని అన్నారు. ఇప్పటికే వెళ్లిన వారిని వెనక్కి పిలిపించాలని తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో ఆర్డీవోలు , జిల్లా, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జోష్‌కు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ కాంగ్రెస్ ను డిఫెన్సులోకి నెట్టే ప్రయత్నం చేసినా రోడ్లెక్కి ఆందోళనలకు దిగినా అల్టిమేట్ గా హస్తం పార్టీదే పైచేయి అయింది. అదెలా ఉన్నా ప్రతిరోజూ ఎవరో ఒకరు కాంగ్రెస్ పార్టీలోకి చేరడం కొనసాగుతూనే ఉంది. గాంధీ భవన్ లో నిత్య కళ్యాణ శోభ పరిఢవిల్లుతోంది. అయితే కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా ఏమి జరుగుతోంది అనే విషయం పక్కన పెడితే ఓ వంక చేరికలతో మంచి ఊపు మీదున్న తెలంగాణ కాంగ్రెస్ కు ఇప్పుడు చిన్న షాక్ తగిలింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆ పార్టీకి షాకిస్తూ, యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ ను వీడి బీఆర్ఎస్ గూటికి చేరారు. ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు. అంతకు ముందు ఆయన స్థానిక భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో మంత్రి జగదీష్ రెడ్డిని కలిశారు. అనంతరం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కాగా భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీరుపై కుంభం అనిల్ అసంతృప్తిగా ఉన్న విషయం తెలిసిందే.నిజానికి, కర్ణాటక గెలుపు, పొంగులేటి, జూపల్లి చేరికలతో కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరిగినా తెలంగాణలో హస్తం పార్టీ రాజకీయాలకు ఉమ్మడి నల్గొండ జిల్లానే కీలకం. ఈ నేపథ్యంలో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేయివదిలి, కారెక్కడం సంచలనంగా మారిందనే చెప్పాలి. నల్గొండ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుల్లో కోమటి రెడ్డి, రెంత్ రెడ్డి జోడీపై పెరుగుతున్న అసంతృప్తికి అనిల్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరడం ఒక సంకేతంగా భావిస్తున్నారు. భువనగిరి కాంగ్రెస్‌లో ఎంపీ కోమటిరెడ్డి వర్సెస్ డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మధ్య వర్గ పోరు సాగిన విషయం తెలిసిందే. తనకు వ్యతిరేకంగా కోమటిరెడ్డి గ్రూప్ రాజకీయాలు ప్రోత్సహిస్తున్నారని, నియోజ కవర్గంలో తన ఓటమికి రహస్య మంతనాలు చేస్తు న్నారని అనిల్ పలుమార్లు ఆరోపించారు. ఆరోపణలు చేసింది అనిల్ కుమార్ రెడ్డి అయినా చేయించింది మాత్ర కోమటి రెడ్డి అనూహ్యంగా రేవంత్ రెడ్డితో చేతులు కలపడాన్ని జీర్ణం చేసుకోలేని సీనియర్ నాయకులే అని అంటున్నారు. అందుకే అనిల్ కుమార్‌రెడ్డి రెడ్డి బీఆర్ఎస్ లో చేరడాన్ని కేవలం చేరిక వ్యవహారంగానే చూడరాదని తెర వెంక కాంగ్రెస్ మార్క్ రాజకీయం నడుస్తోందని అంటున్నారు.

# అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ నగరంలో ప్రజలు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి లతో కలిసి జీహెచ్ఎంసి కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. కంట్రోల్ రూమ్ కు వస్తున్న పిర్యాదులు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. మూడు షిఫ్టులలో వివిధ శాఖల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు మంత్రికి వివరించారు. వాతావరణ శాఖ అందించే సమాచారం మేరకు జీహెచ్ఎంసి పరిధిలోని అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, కమిషనర్ రోనాల్డ్ రోస్, కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ల దూరదృష్టి ఆలోచనలతోనే నగరంలోని అనేక ప్రాంతాలలో వరద ముంపు సమస్య తొలగిపోయిందని పేర్కొన్నారు. నగరంలోని నాలాల సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టిన ఎస్ఎన్డీపీ కార్యక్రమం క్రింద 36 నాలాల అభివృద్ధి పనులు చేపట్టగా, 30 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 6 పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. గత సంవత్సరం వరకు బేగంపేట నాలాకు ఎగువ నుండి వచ్చే వరదనీటి వలన నాలా వెంట ఉన్న బ్రాహ్మణ వాడి, శ్యాం లాల్ బిల్డింగ్ తదితర కాలనీలు వరదనీటితో మునిగిపోయి ప్రజలు అనేక అవస్తలు పడేవారని పేర్కొన్నారు. ఎస్ఎన్డీపీ కార్యక్రమం క్రింద బేగంపేట నాలా అభివృద్ధి పనులు చేపట్టిన ఫలితంగా ఈ సంవత్సరం అలాంటి పరిస్థితులు ఏర్పడలేదని చెప్పారు. ప్రారంభంలో ఎస్ఎన్డీపీ కార్యక్రమంపై పలు విమర్శలు వచ్చాయని, కానీ వాటి ఫలితాలు నేడు కండ్ల ముందు కనిపిస్తున్నాయని అన్నారు. అదేవిధంగా విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ విభాగం దేశంలో ఎక్కడా లేదని, ఆ శాఖ ద్వారా కూడా ప్రజలకు వివిధ అత్యవసర సేవలు అందించాబడుతున్నాయని అన్నారు. కంట్రోల్ రూమ్ కు వచ్చే పిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ క్షేత్రస్థాయి లోని సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. అదేవిధంగా ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా కూడా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావడం పట్ల కూడా మంత్రి వారిని అభినందించారు. ప్రజలు అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ (040-21111111, 9000113667) కు కాల్ చేయాలని కోరారు. హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లలో ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో పై ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు. ఎమర్జెన్సీ టీం లు కంట్రోల్ రూమ్ నుండి వచ్చే ఆదేశాలతో ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాయని అన్నారు. నీరు నిలిచిపోవడం, చెట్లు కూలిపోవడం, సీవరేజ్ పొంగిపోవడం వంటి పిర్యాదులు అధికంగా వస్తున్నాయని, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. చెత్త తొలగింపు, పారిశుధ్య నిర్వహణ వంటి కార్యక్రమాలు కూడా ఎక్కడ ఆగకుండా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్లు కూడా దెబ్బతిన్న ప్రాంతాలలో ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా సర్కిల్ కు ఒకటి చొప్పున 30 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరో 2, 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ప్రకటించిందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని మంత్రి కోరారు. ముసరం బాగ్ వంతెన నిర్మాణ పనులను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## నారాయణపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

-లారీని వెనుక భాగంలో ఢీ కొట్టి ఇరుక్కుపోయిన కారు
-ఇద్దరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
-మృతులు ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా వాసులు



**మక్తల్ - ప్రభాతసూర్యుడు :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలలోకి వెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలానికి చెందిన భాష (50), షికూర్ (50), వెంకట్రావు స్నేహితులు. వీరు ముగ్గురు కలిసి కారులో గోవా వెళ్లారు. విహారయాత్రను ముగించుకొని తిరిగి వస్తుండగా మక్తల్ మండలం, గుడిగండ్ల గ్రామ సమీపంలో హైదరాబాద్ వైపు వెళుతున్న లారీని ఓవర్టేక్ చేయబోయి వెనుక భాగంలో ఢీ కొట్టి లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయింది. ఈ విషయము గమనించని లారీ డ్రైవర్ లారీని యధావిధిగా తీసుకువెళ్లాడు. అర కిలోమీటర్లు పైగా ప్రమాదానికి గురైన కారుతో పాటు లారీ వెళుతుండడం చూసిన కొంతమంది లారీని ఓవర్టేక్ చేసి విషయాన్ని డ్రైవర్ కు చెప్పారు. లారీని పక్కకు ఆపి ప్రమాదం జరిగిన విషయాన్ని గుర్తించిన లారీ డ్రైవర్ భయంతో పరారు అయ్యాడు. విషయం పోలీసులకు తెలియడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని గుర్తించారు. భాష, షుఖుర్ అప్పటికే మృతి చెంది ఉండగా, వెంకట్రావు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు గుర్తించారు. డ్రైవర్ ప్రశాంత్ కు సీటు బెల్టు ఉండడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వెంకట్రావును మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మక్తల్ ఎస్సై పర్వతాలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బండమైలారం

## బద్రీనాథ్ కు పోటెత్తిన భక్తులు

కుత్బుల్లాపూర్ ప్రభాతసూర్యుడు



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్ పట్టణ సమీపంలోనీ బండ మైలారం గ్రామ శివారులో ఉత్తరాఖండ్ కళ్యాణ్ కారి సంస్థ వారు నిర్మించిన బద్రీనాథ్ విష్ణు ఆలయానికి భక్తులు వర్షం కారణంగా విద్యాసంస్థలకు సెలవు రావడంతో అధిక సంఖ్యలో దర్శనానికి వస్తున్నారు. ఉత్తరాఖండ్ కు చెందిన సుమారు 30 వేల కుటుంబాలు హైదరాబాద్ లో స్థిరపడ్డారని ఉత్తరాఖండ్ కళ్యాణ్ గారి సంస్థ అనే పేరుతో 2007 లో సంస్థ ప్రారంభించి బండ మైలారంలో ఫిబ్రవరి 2018 సంవత్సరంలో నిర్మాణం చేపట్టి మందిరం పూర్తయిన వెంటనే ఈ సంవత్సరం జూన్ మాసం 29 తేదీ నుండి భక్తుల సందర్శన ప్రారంభమైందని సంస్థ ప్రెసిడెంట్ విక్రం సింగ్ ఉన్నాల్ తెలిపారు . ఇంత వర్షంలో కూడా ప్రతిరోజు 3500 నుండి 4000 మంది భక్తులు దర్శించుకుంటున్నారని ఆయన తెలిపారు.

## గుండెపోటుతో ఎమ్మెల్యేకుమారుడి మృతి

**హైదరాబాద్,- ప్రభాతసూర్యుడు :** పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి (30) గుండెపోటుతో గురువారం ఉదయం హఠాన్మరణం చెందారు. కిడ్నీలు పాడవడంతో కొన్ని రోజుల క్రితం నుంచి అనారోగ్యంతో కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో గుండెపోటు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన మృతి చెందారు. విష్ణువర్ధన్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే ఆయనకు కామెర్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో విష్ణువర్ధన్‌కు వైద్యులు డయాలసిస్ చేశారు. గత కొద్ది రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలోనే తెల్లవారుజామున 2 గంటలకు గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు విష్ణువర్ధన్ కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని గురువారం ఉదయం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నివాసానికి తరలించారు. కుమారుడి మృతితో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

### పివి ఎక్స్ ప్రెస్ వే పై

## బైక్ ప్రమాదం..ఒకరు మృతి



**రంగారెడ్డి - ప్రభాతసూర్యుడు :** రాజేంద్రనగర్ పివిఎన్నార్ 152 పిల్లర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక మోటార్ సైకిల్ డి వైడర్ ను ఢీ కొట్టింది. మోటర్ సైకిల్ పై ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందారు. మరో కరికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రున్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో ఎక్స్ప్రెస్ వే పై భారీ గా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షం లో మోటర్ సైకిల్ స్కిడ్ కావడం తో రోడ్డు ప్రమాదం జరిగింది. అసలు ఎక్స్ప్రెస్ వే పై టూ వీలర్స్ లకు నో ఎంట్రీ. అయినప్పటికీ ఎక్స్ప్రెస్ వే పై ఎక్కిన బైకిస్టు, మెహదీపట్నం నుండి ఆరంఘర్ వైపు వెళుతున్నట్లు సమాచారం. 152 వ పిల్లర్ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్ కు డీకొట్టింది.

### రహదారికి మరమ్మతులు చేపట్టాలని

## డిమాండ్ చేస్తూ రోడ్డుపై నాటు వేసి నిరసన

**మహబూబ్ నగర్ - ప్రభాతసూర్యుడు :** బూరుగుపల్లి ఆలూరు రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మహబూబ్ నగర్ బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ నేతృత్వం లో రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ బూరుగుపల్లి గ్రామం నుండి ఆలూరు గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలకు నిత్యం విద్యార్థులతో పాటు ఇరు గ్రామాల రైతులు, భూత్పూర్, దివిటి పల్లి,మహబూబ్ న గర్ నుండి నాగర్ కర్నూల్ ఇతర పట్టణాలకు వెళ్లడానికి నిత్యం వేలాదిమంది ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారని తెలిపారు. రోడ్డు గుంతల మయమైన వర్షం పడితే చెరువులను తలపిస్తుందని ప్రయాణికులు విద్యార్థులు పాఠశాలకు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇట్టి విషయమై సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తెసుకేల్లిన ప్రయోజనం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి



చేసారు. ఈ కార్యక్రమంలో,, బీసీ సేన నియోజకవర్గం కార్యదర్శి రామస్వామి , బీసీ సేన నాయకులు పాల్ మాకుల రఘు, కార్మికు విభాగ మండల అధ్యక్షులు చంద్రమౌళి బీసీ సేనమండల అధ్యక్షులు బొల్లెమోని నిరంజన్, భీమయ్య, ప్రకాష్, కుర్మేష్, రమేష్, శేఖర్, పవన్ లు తదితరులు పాల్గొన్నారు.

## పిఎం కిసాన్ 14వ విడత డబ్బులు విడుదల : ఏఓ పవన్ కుమార్

**తుగ్గలి - ప్రభాతసూర్యుడు :** పిఎం కిసాన్ 14వ విడత డబ్బులను పీఎం నరేంద్ర మోడీ విడుదల చేసినట్లు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలియజేశారు. గురువారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ మండలంలో 15,289 మంది రైతులకు 2000 రూపాయలు 14వ విడత లో లబ్ధి పొందనున్నారు. ఇంకా 759 మంది రైతులు ఈ-కేవైసి చేయని కారణంగా వారికి లబ్ధి చేకూరలేదని ఆయన అన్నారు. వారు కూడా తక్షణమే ఈ- కేవైసి చేసుకోవాలని కోరారు. అలాగే ఈరోజు గౌరవ ప్రధాన మంత్రి చేతుల మీదుగా ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు ప్రారంభించబడ్డాయి. ఈరోజు తుగ్గలి మండలంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఆగ్రో ట్రేడర్స్ డీలర్ షాపు నందు ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభించబడింది. ఈ కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ సామాగ్రి మరియు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఏఓ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్,బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మణ స్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శి రామకృష్ణ,విఏఏ లోహిత్ కుమార్ ,డీలర్ మనిధర్,హైదర్ భాష , గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేన్ సాగర్‌లో వరద పరిస్థితిని పరిశీలించిన మంత్రి కేటీఆర్



**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్‌లో వారం రోజులుగా ఎడతెరపిలేకుండా వానలు కురుస్తున్నాయని, దీంతో హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద వచ్చి చేరుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో వరద పరిస్థితిని మంత్రి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. వర్షకాలం ప్రారంభానికి ముందే నాలాల్లో పూడిక తీశామని చెప్పారు. చెరువుల్లోనూ తక్కువ నీటిమట్టం ఉండేలా జాగ్రత్తలు తీసుకు న్నామని వెల్లడించారు. నగరంలో ఎస్సార్‌డీపీ చేపట్టకముందు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యేవని చెప్పారు. విపత్కర పరిస్థితుల్లో చేతనైతే ప్రతిపక్షాలు సహాయక చర్యల్లో పాల్గొనాలని మంత్రి కేటీఆర్ సూచించారు. వర్షాలను కూడా రాజకీయం చేయడం సరికాదన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో 14 బ్రిడ్జిలు మంజూరు చేశామన్నారు. అనంతరం ముసారంబాగ్ వద్ద మూసీనదిపై ఉన్న బ్రిడ్జిని మంత్రి కేటీఆర్ పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పురపాలక శాఖ మంత్రి ఏఋఖీఃఖీూ పర్యటించారు. హుస్సేన్ సాగర్ వద్ద వరద ఉధృతిని మంత్రి పరిశీలించారు. అనంతరం చాదర్ ఘాట్ మూసీ నదిలో-లెవెల్ వంతెన వద్ద వరదను పరిశీలించారు.

### హైదరాబాద్ లో

## కేటీఆర్ పర్యటన అండగా ఉంటామని హామీ


**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలను గౌరవ ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని.. పురపాలక శాఖ అధికారులతోనూ కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా మాట్లాడారని తెలిపారు. ల హైదరాబాద్ నగరంలోనూ జిహెచ్ఎంసి కమిషనర్ మరియు ఇతర ఉన్నతాధికారులు... క్షేత్రస్థాయిలో ఉన్న కిందిస్థాయి సిబ్బంది వరకు అందరూ పనిచేస్తున్నారు. పురపాలక ఉద్యోగుల అన్ని సెలవులను రద్దు చేయడం జరిగింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫోన్ల ద్వారా ఇతర మాధ్యమాల ద్వారా సమీక్షి స్తున్నామన్నారు. కుంభవృష్టిగా వర్షం పడడం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం వలన ప్రజలకు కొంత ఇబ్బంది ఎదురవు తున్నదని తెలిపారు. ఇప్పటిదాకా ఎలాంటి ప్రాణా నష్టం జరగకుండా సాధ్యమైనని ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రధాన లక్ష్యం ప్రాణ నష్టం జరగకుండా చూడడమేనని.. హైదరాబాద్‌కు రెడ్ అలర్ట్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుందన్నారు. హైదరాబాద్ నగరంలో డిసిల్టింగ్ కార్యక్రమాన్ని ఎప్పుడో పూర్తి చేశామని.. దీంతోపాటు చెరువుల బలోపేతం చేసే కార్యక్రమాలు కూడా చేపట్టాము. 135 చెరువులకు గేట్లు బిగిం చామన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు అధికారులు సిబ్బంది కూడా విస్తృతంగా పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. గతంలో ఇలాంటి భారీ వర్షాలు పడితే అనేక ప్రాంతాలు జలమయం అయ్యేది. అయితే ఈసారి నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా చేపట్టిన కార్యక్రమాల వలన వరద ప్రభావం కొంత తగ్గిందని సంతృప్తి వ్యక్తం చేశారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఆయా ప్రాంతాల్లో వరద సమస్య బాగా తగ్గింది .. ప్రభుత్వము, ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సిబ్బంది 24 గంటలు ఈ భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు పనిచేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు మాని... భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. భారీ వర్షాల్లో నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసే విధంగా చిల్లర విమర్శలు చేయవద్దన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు వర్షాన్ని ఎదుర్కొనేందుకు పనిచేస్తున్నాయి వారి మనో ధైర్యం దెబ్బతినకుండా నాయకులు మాట్లాడితే బాగు ంటుందని సలహా ఇచ్చారు. వరద పెరిగే ప్రాంతాల్లో ఉన్న పౌరులను అలర్ట్ చేస్తున్నామని.. ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేస్తూ తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. చెరువులకు గండి పడే ప్రమాదం ఉంటే వాటిని కూడా సమీక్షిస్తున్నామన్నారు. వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించాము. అవసరమైతే రేపు నేను కూడా స్వయంగా వెళ్తానన్నారు. హైదరాబాద్ నగరంలోనూ పలు ప్రాంతాల్లో కేటీఆర్ పర్యటించారు. హుస్సేన్ సాగర్ వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ల ప్రాణ నష్టం జరగకుండా చూడడమే ప్రాథమిక ప్రాధాన్యతగా పని చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపైన అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. శిథిల భవనాల నుంచి జనాలను వెంటనే తరలించాలన్నారు.

### వరద ప్రభావిత ప్రాంతాల్లో

## చర్యలు చేపట్టండి:రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** మంత్రి కేటీఆర్ కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాసారు. గ్రేటర్ హైదరాబాద్ లో వరదలు, సహాయక చర్యలపై లేఖలో ప్రశ్నించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ నగరం విలవిలలాడుతోంది. లోతట్టు ప్రాంతాల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. ప్రజల గోసను పట్టించుకోవాల్సిన మీరు పత్తా లేకుండా పోయారు. పుట్టిన రోజు పండగలపై ఉన్న ఆసక్తి ప్రజల ఇబ్బందులపై లేదు విశ్వనగరంగా తీర్చిదిద్దామని సెల్ఫ్ డబ్బాలు కొట్టుకోవడానికి పోటీ పడే మీరు, ప్రజలు బయటకు రావాలంటేనే ఆలోచించుకునే దుస్థితిని హైదరాబాద్ కు కల్పించారని అన్నారు. ప్రజలు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుంటూ తిరిగాల్సిన పరిస్థితిని కల్పించారు. మీ అసమర్థ పాలనలో ఇది విశ్వనగరమో.. విషాద నగరమో తేలిపోయింది. ట్రాఫిక్ సమస్యలతో నగర ప్రజలు నానా యాతన పడుతున్నారు. బీఆరెస్ నేతల కబ్జాలు, అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలతోనే నగరానికి ఈ పరిస్థితి. చర్యలు తీసుకోవాల్సిన మీరు నిమ్మకునీరెత్తినట్టు వ్యవ హరిస్తున్నారు. హైదరాబాద్ లో ఇటువంటి పరిస్థితి రాబోతుందని మేం హెచ్చరించినా పట్టించుకోలేదు. నగరంలో వరద బీభత్సం సృష్టిస్తున్నా కనీసం సమీక్ష చేసే సమయం మీకు లేదు. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించైనా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గతంలో వరదల సమయంలో మీరు చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. అప్పట్లో ప్రకటించిన పది వేల సాయం ఎన్నికల పథకంగా మిగిలిపోయింది. ఇప్పటికైనా ప్రజల కష్టాలను తీర్చే ప్రయత్నం చేయండి. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టండి. ప్రభావిత ప్రజలకు రూ. 10 వేల సాయం ప్రకటించండి. లేకపోతే శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. మీ చేతగానితనాన్ని ఎండగట్టి తగిన బుద్ధి చెబుదామని పేర్కొన్నారు.

## బాత్రూం గోడ కూలి మహిళ దుర్మరణం



**కోరుట్ల - ప్రభాతసూర్యుడు :** కోరుట్ల పట్టణంలోని జవహర్ రోడ్ కు చెందిన బోస్కరి విజేత (29) స్నానం చేయడం కోసం బాత్రూం కు వెళ్ళింది. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసిన గోడ కూలి విజేతపై పడింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే విజేత మృతి చెందిందని నిర్ధారించారు. ఆమె భర్త కాశీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరుట్ల ఏస్సై ఈ కిరణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతురాలికి ఇద్దరూ పిల్లలున్నారు. మృతురాలి కుటుంబాన్ని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఆన్నం ఆనిల్ తోపాటు వివిధ పార్టీ ల స్థానిక నాయకులు పరామర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. బాధిత కుటుంబాన్ని ఆదు కోవాలని ఎమ్మెల్యే ను కోరినట్లు అనిల్ తెలిపారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215